సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
గురువారం । 22 । ఫిబ్రవరి । 2024



అన్నదాన భవన నిర్మాణానికి విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి వెంకన్న ఆలయ ఆవరణలో నిర్మిస్తున్న అన్నదాన భవనానికి సలాది శ్రీనివాస్, లక్ష్మి దంపతులు (కపిలేశ్వరపురం) రూ.51 వేల విరాళం అందజేశారు.



రూ.50 వేల సమర్పణ

మామిడికుదురు: అప్పనపల్లి బాలాజీ నిత్యాన్నదానం ట్రస్టుకు రెడ్డి రాఘవేంద్ర రావు, అపర్ణ సరోజినీదేవి దంపతులు (వేల్పూరు) రూ.50,111 విరాళంగా సమర్పించారు.

డెల్టా కాలువలకు 8,970 క్యూసెక్కులు



ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు బుధవారం 8,970 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,650, మధ్య డెల్టాకు 1,720, పశ్చిమ డెల్టాకు 4,600 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజీ వద్ద 9.95 అడుగుల వద్ద నీటిమట్టం కొనసాగుతోంది.

న్యూస్‌రీల్

స్కూల్ బస్సు కొనుగోలుకు రూ.10 లక్షల విరాళం



బస్సును ప్రారంభిస్తున్న ఎన్‌సీసీ డైరెక్టర్ సుబ్బరాజు

మలికిపురం: లక్కవరంలోని సరస్వతి శిశు మందిర్ పాఠశాలకు బస్సు కొనుగోలు కోసం ప్రముఖ నిర్మాణ సంస్థ నాగార్జున కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ రూ.10 లక్షల విరాళం అందించింది. దీనికి పాఠశాల తరఫున మరి కొంత నగదును జత చేసి రూ.17.50 లక్షలతో బస్సును కొనుగోలు చేశారు. దానిని సంస్థ డైరెక్టర్ రుద్రరాజు సుబ్బరాజు బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సంప్రదాయ విద్యనందిస్తున్న సంస్థకు అండగా నిలవాలని భావించి, సాయమందించామన్నారు. కార్యక్రమంలో మంగెన వెంకట నరసింహారావు, బోనం రాజు, చిన వెంకటరాజు, ఆర్‌సీపీ రాజు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నగరోత్సవం



ద్రాక్షారామలో కల్యాణ మూర్తుల నగరోత్సవం

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీ ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వర స్వామి, క్షేత్ర పాలకులైన లక్ష్మీ సమేత నారాయణస్వామి, చండికా సమేత సూరేశ్వరస్వామివార్ల కల్యాణ మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు బుధవారం ఉదయం పల్లకీలపై కల్యాణమూర్తుల నగరోత్సవం నిర్వహించారు. అనంతరం రాత్రి గరుడ వాహనంపై కల్యాణ మూర్తులను మేళతాళాలతో ఊరేగించారు. ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అర్చక స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

సూర్యకుమారికి తెలుగు అకాడమీ పురస్కారం



లక్ష్మీపార్వతి నుంచి పురస్కారం అందుకుంటున్న సూర్యకుమారి

బోట్‌క్లబ్ (కాకినాడ): అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం సందర్భంగా బుధవారం గుంటూరులోని నాగార్జున విశ్వవిద్యాలయంలో రాష్ట్ర తెలుగు, సంస్కృత అకాడమీ ఆధ్వర్యంలో కాకినాడ నగరానికి చెందిన ప్రముఖ రచయిత్రి పుప్పాల సూర్యకుమారిని తెలుగు అకాడమీ పురస్కారంతో సత్కరించారు. అకాడమీ అధ్యక్షురాలు నందమూరి లక్ష్మీపార్వతి, నాగార్జున విశ్వవిద్యాలయం ఉప కులపతి పి.రాజశేఖర్ చేతుల మీదుగా పురస్కారం అందించారు. ఆమెను పలువురు ప్రముఖులు అభినందించారు.

చిన్నారిని రక్షించిన 108 సిబ్బంది



చిన్నారికి ఆక్సిజన్ అమర్చుతున్న 108 సిబ్బంది

తుని: ప్రాణాపాయ స్థితిలో ఉన్న చిన్నారిని బుధవారం 108 సిబ్బంది రక్షించారు. వివరాల్లోకెళితే..చెన్నై సెంట్రల్ నుంచి షాలిమార్ వెళ్లే కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్న బెంగాల్ వాసుల కుటుంబంలో మూడేళ్ల చిన్నారి శ్వాస ఆడక అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. తోటి ప్రయాణికులు 108కు ఫోన్ చేయడంతో పాయకరావుపేట 108 అంబులెన్స్ సిబ్బంది రైలు తుని చేరుకునే సరికి రైల్వేస్టేషన్‌కు వెళ్లారు. చిన్నారిని అంబులెన్స్ ఎక్కించి ఆక్సిజన్ అమర్చి తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. చిన్నారిని అంబులెన్స్‌లో ఆసుపత్రికి చేర్చడంలో ఆర్పీఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ సునీత, కానిస్టేబుల్ విజయ సేవలందించారు.

కొత్త బంగారు లోకం

- విద్యార్థుల బంగారు భవితకు ప్రభుత్వం చర్యలు
- గ్రామాల్లోనే కాలేజీ చదువులు
- ఉమ్మడి జిల్లాలో కొత్తగా 25 కో ఎడ్యుకేషన్ కళాశాలల ఏర్పాటు

సాక్షి అమలాపురం: నాడు - నేడు కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ స్కూళ్లలా మారడం, పాఠశాల స్థాయిలో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టడం, అంతర్జాతీయ స్థాయిలో విద్యా ప్రమాణాలు పెంచేందుకు డిజిటల్ తరగతులు నిర్వహించడం, బైజూస్ పాఠాలు అందుబాటులోకి రావడం, కొత్తగా ఐఎఫ్‌పీల ద్వారా విద్యా బోధన ప్రారంభించడం వంటి విప్లవాత్మక మార్పులన్నీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాతే ఆరంభమైంది. గ్రామీణ స్థాయిలో పాఠశాల స్థాయి విద్యకు పెద్ద పీట వేయడం ద్వారా కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కాలేజీ చదువులకు సైతం కొత్త రూపు కల్పిస్తున్నారు.

గతంలో ఇబ్బందులు

గ్రామీణ ప్రాంతాలలో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఇంటర్మీడియెట్ చదివేందుకు సమీపంలోని పట్టణాలకు, లేదా అభివృద్ధి చెందిన గ్రామాలలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీలకు వెళ్లాల్సి వచ్చేది. ఇది వ్యయప్రయాసలతో కూడుకున్న వ్యవహారంగా మారేది. ప్రభుత్వ పాఠశాలల సంఖ్య కూడా చాలా తక్కువగా ఉండడం వల్ల కష్టమైనా, ఆర్థికంగా భారమైనా ప్రైవేట్ కాలేజీలను ఆశ్రయించాల్సి వచ్చేది. తద్వారా చాలామంది విద్యార్థులు ముఖ్యంగా బాలికలు పదో తరగతి తర్వాత పైచదువులకు వెళ్లేవారు కాదు.

చదువుకు పెద్దపీట

ఈ సమస్య పరిష్కారం కోసం సీఎం వైఎస్ జగన్ గ్రామీణ ప్రాంతాలలో కాలేజీ చదువులకు పెద్ద పీట వేయాలని నిర్ణయించారు. దీనిలో భాగంగా రెండేళ్ల క్రితం పెద్ద ఎత్తున జూనియర్ కాలేజీలను ఏర్పాటు చేశారు. తూర్పు గోదావరి జిల్లాలో 19, కాకినాడ జిల్లాలో 21, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 22 చొప్పున మొత్తం 62 కాలేజీలను ఏర్పాటు చేశారు. వీటిలో బాలికలు మాత్రమే చదువుతున్నారు. ప్రభుత్వం మండలానికి రెండు కాలేజీలు చొప్పున ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో కొత్తగా మరో 25 కాలేజీలకు అనుమతి మంజూరు చేసింది. తూర్పు గోదావరి జిల్లాలో 7, కాకినాడ జిల్లాలో 8, కోనసీమ జిల్లాలో 10 కాలేజీలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. వీటిలో కో ఎడ్యుకేషన్‌కు అనుమతి ఇచ్చారు. ఈ జూన్ ఒకటి నుంచి ఈ కాలేజీల్లో తరగతులు మొదలు కానున్నాయి.



జూనియర్ కాలేజీగా మారనున్న తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం ఖండవల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల



కాకినాడ జిల్లాలోని యు.కొత్తపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల

జిల్లాల వారీగా మంజూరైన కొత్త కాలేజీలు

- తూర్పు గోదావరి జిల్లాలోని అనపర్తి జెడ్పీ ఉన్నత పాఠశాల, బిక్కవోలు, నల్లజర్ల మండలం పోతవరం, పెరవలి మండలం ఖండవల్లి, రాజానగరం మండలం పాత తుంగపాడు, ఉండ్రాజవరం మండలం సత్యవాడ, రాజమహేంద్రవరం అర్బన్‌లోని ఆర్యాపురం మున్సిపల్ హైస్కూల్లో కొత్తగా జూనియర్ కాలేజీల ఏర్పాటుకు ప్రభుత్వం అంగీకరించింది.
- కాకినాడ జిల్లాలోని పెదపూడి మండలం గొల్లల మామిడాడ జెడ్పీహెచ్‌ఎస్ (బాలురు), గండేపల్లి, కోటనందూరు, పెద్దాపురం మండలం కాండ్రకోట, ప్రత్తిపాడు, రౌతులపూడి, తొండంగి, యు.కొత్తపల్లి జెడ్పీహెచ్‌ఎస్ స్కూల్లో కొత్తగా జూనియర్ కాలేజీలను ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది.
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అల్లవరం మండలం కొమ్మరగిరిపట్నం, అమలాపురం సూర్యనగర్, అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు, ఆత్రేయపురం మండలం పేరవరం, ఐ.పోలవరం, కపిలేశ్వరపురం మండలం అంగర, కాట్రేనికోన మండలం కందికుప్ప, కె.గంగవరం, సఖినేటిపల్లి మండలం రామేశ్వరం, ఉప్పలగుప్తం మండలం చల్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో కోఎడ్యుకేషన్ జూనియర్ కాలేజీలను ఏర్పాటు చేయనుంది.



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని కపిలేశ్వరపురం మండలం అంగర హైస్కూల్

అందుబాటులో కాలేజీ విద్య



చేబ్రోలు ఉన్నత పాఠశాలలో జూనియర్ కాలేజీ ఏర్పాటు చేశారు. ఇక్కడ ఉన్న హైస్కూల్లో పదో తరగతి పూర్తి కాగానే కొత్తగా కాలేజీ మొదలైంది. సొంత ఊరిలోనే కాలేజీ ఏర్పాటు చేయడం మాకు చాలా సౌక్యంగా ఉంది. ఈ కాలేజీ లేకుంటే పిఠాపురం వెళ్లి చదవాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ ఇబ్బంది లేకుండా చక్కగా చదువుకుంటున్నాను.

– పి.అనూష, ఇంటర్మీడియెట్ తొలి సంవత్సరం, చేబ్రోలు

సొంత ఊరిలోనే చదువు



పదో తరగతి తర్వాత పైచదువుల కోసం కాలేజీలకు బయట ఊరు వెళ్లాలంటే భయంగా ఉండేది. కానీ సొంత ఊరిలోనే జూనియర్ కాలేజీ పెట్టడం మాకు ఎంతో ఉపయోగపడింది. దగ్గరలోనే కాలేజీ ఉండడంతో మా తల్లిదండ్రులు నన్ను చదివించడానికి ఆసక్తి చూపించారు. కాలేజీకి వెళ్లరావడానికి మాకు చాలా సులభంగా ఉంది.

– సీహెచ్ కావేరి సిరి, అంబాజీపేట

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం



ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యమిస్తోంది. ప్రతి మండలంలో కో ఎడ్యుకేషన్‌తో పాటూ బాలికలకు ప్రత్యేకంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేస్తోంది. అందులో భాగంగానే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను ప్లస్ 2 పాఠశాలలుగా ఏర్పాటు చేస్తోంది. ప్రభుత్వ ఉత్వర్వుల మేరకు ఆయా పాఠశాలలు ప్లస్ 2 పాఠశాలలుగా మారనున్నాయి. ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయి ఆదేశాలు రాగానే ఆ దిశగా చర్యలు చేపడతాం.

– ఎం.కమలకుమారి, డీఈవో, అమలాపురం

అమ్మతో, తెలుగుతో జీవితాంతం అనుబంధం



మాట్లాడుతున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి వేణుగోపాలకృష్ణ
- ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): అమ్మతో, తెలుగు భాషతో జీవితాంతం అనుబంధం ఉంటుందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. బుధవారం రాజమహేంద్రవరంలోని ధర్మం చర కమ్యూనిటీ హాల్ వేదికగా అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిలాంత్రోఫిక్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు అద్దంకి రాజా యోనా ఆధ్వర్యంలో గోదావరి కళా దర్బార్ 2024 జాతీయ ప్రతిభా పురస్కారోత్సవం కన్నుల పండువగా జరిగింది. శ్రీ శ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై 30 మందికి గోదావరి కీర్తి పురస్కారాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ తెలుగును గౌరవించడం అంటే మనలను మనం గౌరవించుకోవడమే అన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ మీడియా అకాడమీ కార్యదర్శి ఎం.బాల గంగాధర్ తిలక్ మాట్లాడుతూ మాతృ భాషాభివృద్ధికి కృషి చేసిన వ్యక్తులను గౌరవించడం మంచి సంప్రదాయం అని తెలిపారు. కత్తిమండ ప్రతాప్ మాట్లాడుతూ తెలుగు భాషా, సంస్కృతి అభివృద్ధికి మరింత సేవలు అందించాలని కోరారు. తెలంగాణ కళా పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ పగిడిపల్లి రాజారావు, వైఎస్సార్ సీపీ నాయకులు నక్కా నగేష్, శ్రీ విజ్ఞాన వేదిక అధ్యక్షుడు చెరుకువాడ రంగసాయి తదితరులు పాల్గొన్నారు.

సీఎస్ఆర్ నిధులతో మౌలిక వసతులు

- కలెక్టర్ హిమాన్షు శుక్లా
- రిలయన్స్ సమకూర్చిన పరుపుల పంపిణీ

అమలాపురం రూరల్: కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కింద జిల్లాలోని ఎస్సీ, బీసీ సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న 7 వేల మంది విద్యార్థులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతోందని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ సీఎస్ఆర్ ఫండ్ కింద సమకూర్చిన రూ.10 లక్షలతో కొనుగోలు చేసిన 1,020 పరుపులను బుధవారం కలెక్టరేట్ సమావేశపు హాల్లో విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రిలయన్స్ కంపెనీ మరో 6000 మందికి పరుపులు సమకూర్చాల్సిందిగా సీఎస్ఆర్ ప్రతినిధి పి.సుబ్రహ్మణ్యానికి సూచించారు. ఇప్పటికే రిలయన్స్ సంస్థ 55 సంక్షేమ వసతి గృహాలకు సీఎస్ఆర్ కింద ఇన్వర్టర్లను అందించిందన్నారు. మరో నాలుగు నెలల్లో గెయిల్ సహకారంతో సురక్షిత తాగునీటి కోసం ఆర్వో ప్లాంట్లు రానున్నాయని, వీటికి వాటర్ కూలర్లు అమర్చడం జరుగుతుందన్నారు. కొన్ని సంక్షేమ వసతి గృహాలకు టీవీలను సమకూర్చామని, మిగిలిన వాటికి కూడా సీఎస్ఆర్ కింద ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. విద్యుత్ బిల్లుల బెడదను తొలగించే దిశగా సంక్షేమ వసతి గృహాలపై సౌర విద్యుత్ ప్యానల్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. విద్యార్థినులు మాట్లాడుతూ నోట్ బుక్స్ అందజేయాలని, వడ్డిగూడెం సంక్షేమ వసతి గృహానికి రాకపోకల కోస మరో బస్సును కేటాయించాలని, వాషింగ్ మెషీన్లు ఏర్పాటు చేయాలని, సంక్షేమ వసతి గృహాలకు కుక్కర్, గ్రైండర్లు మిక్సీలు అందించాలని కోరారు. వాటన్నింటినీ సమకూర్చుతానని కలెక్టర్ హామీ ఇచ్చారు. ప్రస్తుతం పంపిణీ చేసిన వాటిలో 514 పరుపులను సాంఘిక సంక్షేమ వసతి గృహాలకు, 506 పరుపులను వెనుకబడిన తరగతుల వసతి గృహాలకు అందిస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఓ వెంకటేశ్వర్లు, బీసీ వెల్ఫేర్ అధికారి వై.సాంబమూర్తి పాల్గొన్నారు.



రిలయన్స్ సమకూర్చిన పరుపులను విద్యార్థులకు అందజేస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, అధికారులు

కచ్చితత్వంతో ఓటర్ల జాబితా

అమలాపురం రూరల్: ఓటర్ల జాబితాను కచ్చితత్వంతో రూపొందించేందుకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ వంతు సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా కోరారు. కలెక్టరేట్‌లో బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి, ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ ప్రక్రియలోని పురోగతిని వివరించారు. ఈ సందర్భంగా ఫిర్యాదులు, అభ్యంతరాలపై తీసుకున్న చర్యలను వివరించారు. పోలింగ్ విధులకు ప్రభుత్వ ఉద్యోగుల వివరాలను సేకరించి కంప్యూటరీకరణ చేయడం జరుగుతోందన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వారికి నియామక ఉత్తర్వులు జారీ చేస్తామన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఎన్నికల నిర్వహణ సంబంధించి ఏ విధమైన సమాచారం అవసరం ఉన్నా కలెక్టర్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు సంసాని చంద్రశేఖర్ (నాని), వివిధ రాజకీయ పార్టీల నాయకులు దూరి రాజేష్, వడ్డి నాగేశ్వరరావు, అల్లాడి స్వామి నాయుడు, కాశీ లక్ష్మీభవాని, కారేం వెంకటేశ్వరరావు, పి.పవన సూర్య, ఎన్నికల ఉద్యోగులు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

గిట్టుబాటు కాని పెట్టుబడి

- కొబ్బరి ఆదాయం కన్నా ఖర్చు మిన్న
- దిగజారిన దిగుబడులు
- ఆందోళనలో రైతులు

మామిడికుదురు: కోనసీమ పేరు వినగానే ఠక్కున గుర్తుకు వచ్చేది కొబ్బరి చెట్లు. పది కొబ్బరి చెట్లు ఉంటే ఎంతో హాయిగా బతికేయవచ్చనేది పూర్వ పు మాట. నేడు పరిస్థితి తారుమారైంది. నెల నెలా ఆదాయాన్నిచ్చే కొబ్బరి పంట దిగుబడులు గణనీయంగా తగ్గాయి. గతంలో నెలకు తీసే దింపు, నేడు మూడు నెలలకు ఒక్కసారి తీయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మూడు నెలలకు దింపు తీయించినా ప్రయోజనం శూన్యం. వచ్చే ఆదాయం దింపు తీసిన కార్మికులకు, కూలీలకు కూడా సరిపోవడం లేదు. ఎదురు పెట్టుబడి పెట్టాల్సి రావడంతో కోనసీమ రైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. లక్షలాది మంది రైతుల జీవనాధారమైన కొబ్బరి పంట దిగుబడులు సన్నగిల్లడం, ధరలు నిరాశాజనకంగా ఉండడం కోనసీమలోని అన్ని రంగాలపైన తీవ్ర ప్రభావం చూపుతోంది. అన్ని రంగాలు అమ్మకాలు లేక వెల వెలబోతున్నాయని వ్యాపారుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత వేసవి కాలం పెట్టుబడుల సీజన్ కావడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. దుక్కులు దున్నించడం, నీటి తడులు పెట్టడం వంటి ఖర్చులు ఉన్నాయని, వాటికి అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

44 వేల హెక్టార్లలో కొబ్బరి సాగు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో సుమారు 44,663 హెక్టార్ల విస్తీర్ణంలో కొబ్బరి పంట సాగులో ఉంది. గతంలో ఎకరం పొలంలో నెలకు దింపు తీస్తే 800 నుంచి 900 కొబ్బరి కాయలు దిగుబడి వచ్చేదని రైతులు చెబుతున్నారు. రెండేళ్ల నుంచి రెండు నెలలకు ఒకసారి దింపు తీయగా 1,000 నుంచి 1,500 కొబ్బరి కాయలు దిగుబడి వస్తోందన్నారు. ఇటీవల కాలంలో మూడు నెలలకు ఒకసారి దింపు తీసే విధంగా పరిస్థితులు దిగజారాయన్నారు. ప్రస్తుతం ఎకరానికి 250 నుంచి 300 కాయలు దిగుబడి వస్తోందని రైతులు పేర్కొన్నారు. దింపు తీయించేందుకు ఒక కొబ్బరి కాయకు నాలుగు రూపాయలు ఖర్చు కాగా, దాని ద్వారా వచ్చే ఆదాయం మూడు రూపాయలు మాత్రమే అని రైతులు వాపోతున్నారు. ఆదాయం కన్నా ఖర్చు ఎక్కువ ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొబ్బరి ధరలు క్షీణించడం, దిగుబడు లు దెబ్బతినడంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



గతంలో ఎన్నడూ ఈ పరిస్థితి చూడలేదు



నాకు మూడెకరాల కొబ్బరి తోట ఉంది. గతంలో కొబ్బరి దిగుబడులు ఎంతో ఆశాజనకంగా ఉండేవి. ఇటీవల కాలంలో దిగుబడులు గణనీయంగా తగ్గాయి. నెల నెలా తీసే దింపు మూడు నెలలకు వచ్చింది. దింపు తీయించేందుకు కూడా పరిస్థితులు అనుకూలంగా లేవు. దానిపై వచ్చే ఆదాయం దానికే సరిపోవడం లేదు. ఎదురు పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. ఇదే పరిస్థితి కొనసాగితే పరిస్థితులు చాలా దారుణంగా ఉంటాయి. పెట్టుబడులు పెట్టేందుకు కూడా పరిస్థితులు సానుకూలంగా లేవు. గతంలో ఎప్పుడూ ఈ పరిస్థితి లేదు. పరిస్థితుల్లో మార్పు వస్తుందని ఆశగా ఎదురుచూస్తున్నాం.

– వేగి రాంబాబు, రైతు, పెదపట్నంలంక

ధరలు కూడా నిరాశ కలిగిస్తున్నాయి



దిగుబడులకు తోడు కొబ్బరి ధరలు కూడా నిరాశాజనకంగా ఉన్నాయి. దిగుబడి తగ్గినా ధర బాగుంటే పరిస్థితి ఇంత దారుణంగా ఉండేది కాదు. కొబ్బరి రాశులు రూ.8 వేల నుంచి రూ.9 వేలకు కొంటున్నారు. కుర్డీ కొబ్బరిని రూ.వెయ్యికి కొంటున్నారు. కొబ్బరి రాశులు రూ.12 వేలకు, కుర్డీ కొబ్బరిని రూ.14 వేలకు కొనాల్సి ఉంది. ఈ రీతిలో ధరలు ఉంటే దిగుబడులు తగ్గినా పెద్దగా ప్రభావం ఉండదు. కానీ ప్రస్తుత పరిస్థితుల చాలా కఠినంగా ఉన్నాయి. ఆదాయం మాట దేవుడెరుగు, అప్పులు మాత్రం మిగులుతున్నాయి. పరిస్థితుల్లో మార్పు రావాలని కోరుకుంటున్నాం.

– పినిశెట్టి శ్రీనివాస్, రైతు, బి.దొడ్డవరం

పోషక యాజమాన్యం పాటించాలి



సమగ్ర పోషక యాజమాన్యంతో పాటు నీటి యాజమన్యం చర్యలు చేపట్టడం ద్వారా దిగుబడులు పెంచుకోవాలి. ఒక చెట్టుకు ఏడాదికి రెండున్నర నుంచి మూడు కిలోలు పొటాష్ వేయాలి. దీని వల్ల పిందె రాలుడును అరికట్టవచ్చు. దిగుబడి కూడా గణనీయంగా పెరుగుతుంది. దీని వల్ల పురుగులతో పాటు తెగుళ్ల నుంచి రక్షణ లభిస్తుంది. భూసార పరీక్షలు చేపట్టి దానికి అనుగుణంగా ఎరువులు వాడాలి. బోరాన్, మెగ్నీషియం కొబ్బరి చెట్లకు చాలా అవసరం. వీటి వాడకం ద్వారా సూక్ష్మధాతు లోపాలను నివారించుకోవాలి. నలభై ఏళ్ల దాటిన చెట్ల స్థానే కొత్త మొక్కలు వేసుకోవాలి. నాణ్యమైన మొక్కలు వేసుకోవాలి.

– ఎన్‌బీవీ చలపతిరావు, ప్రిన్సిపల్ సైంటిస్ట్, ఉద్యాన పరిశోధనా స్థానం, అంబాజీపేట

వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరికలు



వైఎస్సార్ సీపీలో చేరిన వారికి పార్టీ కండువాలు వేసిన సుబ్బారావు

ప్రత్తిపాడు: రానున్న ఎన్నికల్లో ఎన్ని పార్టీలు కలిసికట్టుగా పోటీ చేసినా వైఎస్సార్ సీపీ విజయం తథ్యమని ఆ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల సుబ్బారావు అన్నారు. మండలంలోని లంపకలోవ గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు జల్లిగంపల ప్రభాకర రావు ఆధ్వర్యంలో సుమారు 500 కుటుంబాలు బుధవారం రాత్రి వరుపుల సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరాయి. ఈ సందర్భంగా వరుపుల మాట్లాడుతూ రాష్ట్రంలో జగనన్న చేస్తున్న అభివృద్ధిని చూసి వివిధ పార్టీల ప్రజలు నేడు వైఎస్సార్ సీపీలోకి చేరుతున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకు అతీతంగా, పారదర్శకంగా ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందజేశారన్నారు. పార్టీలో చేరుతున్న ప్రతీ ఒక్కరికీ మంచి భవిష్యత్తు కల్పిస్తామని అన్నారు. పార్టీలో చేరిన ఉపసర్పంచ్ చిట్టిమూరి రేతమ్మ, చెక్కపల్లి సురేష్, పంది రాజా, చెక్కపల్లి బాబ్జి, చీకట్ల రాంబాబు, గంగబాబు, పాలిక అప్పారావు, కింతాడ దమయంతి, టి.వెంకటేశ్వరరావులకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

క్లుప్తంగా

23న కబడ్డీ జిల్లా జట్టు ఎంపిక

కిర్లంపూడి: మండలంలోని వేలంకలో శుక్రవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పురుషుల కబడ్డీ జట్టును ఎంపిక చేయనున్నట్టు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు గొలిగూరి వెంకట రెడ్డి, సెక్రటరీ చేదలూరి మణివీరకంఠ తెలిపారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. 85 కేజీల లోపు బరువు ఉండి, ఆసక్తి కలిగిన క్రీడాకారులు తమ ఆధార్ కార్డుతో రావాలన్నారు. మరిన్ని వివరాల కోసం 95733 49777 (మణికంఠ), 96766 64121 (పోలారావు) నంబర్లను సంప్రదించాలని సూచించారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు విశాఖపట్నంలో వచ్చే నెల 3 నుంచి 5 వరకూ జరిగే 70వ ఆంధ్రరాష్ట్ర అంతర్ జిల్లాల పురుషుల కబడ్డీ పోటీల్లో పాల్గొంటారన్నారు.

లైంగిక వేధింపుల ఫిర్యాదుపై విచారణ

రౌతులపూడి: లైంగిక వేధింపుల ఆరోపణతో బదిలీపై వచ్చిన ములగపూడి జెడ్పీ హైస్కూల్ పీడీని నానిబాబును జిల్లా రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ (ఆర్‌జేడీ) జి.నాగమణి, జిల్లా ఐసీడీఎస్ పీడీ కొండ ప్రవీణ బుధవారం విచారణ చేశారు. ఆయన గతంలో ప్రత్తిపాడు మండలం గజ్జనపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీడీగా పని చేసినప్పుడు లైంగిక వేధింపులకు గురిచేశాడని పలువురు బాలికలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నానిబాబు నుంచి పలు వివరాలు సేకరించారు. దీనిపై నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని అధికారులు తెలిపారు.

పది పరీక్షలపై అవగాహన

పదో తరగతి విద్యార్థులు ఎలాంటి భయాందోళనకు గురి కాకుండా, ధైర్యంగా, స్వేచ్ఛగా పరీక్షలకు హాజరై మంచి మార్కులు సాధించాలని ఆర్‌జేడీ నాగమణి, ఐసీడీఎస్ పీడీ ప్రవీణ సూచించారు. విద్యార్థినులను ఉపాధ్యాయులు తమ సొంత పిల్లల మాదిరిగా చూసుకోవాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై పరీక్షలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు శ్రీనివాస్, కొండబాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చిట్టియ్య పాల్గొన్నారు.

శిరోముండనం కేసులో ప్రధాన సాక్షి మృతి


కోటి పెదరాజు (ఫైల్)

రామచంద్రపురం రూరల్: వెంకటాయపాలెం శిరోముండనం కేసులో ప్రధాన సాక్షి అయిన కోటి పెదరాజు (58) ఈనెల 20న మృతి చెందాడు. అతడు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కోటి పెదరాజు రాజు మృతిపై పలు దళిత సంఘాల నాయకులు సంతాపం తెలిపారు.

సాంకేతిక విద్యతో బంగారు భవిత

- పాలిసెట్ నోటిఫికేషన్ విడుదల
- పదో తరగతి విద్యార్థులకు చక్కటి అవకాశం


పదో తరగతి విద్యార్థులు

రాయవరం: పదో తరగతి విద్యార్హతతో సాంకేతిక విద్యకు పునాది వేసే పాలిసెట్‌కు రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పరీక్ష ద్వారా రాష్ట్రంలోని అన్ని పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలు లభిస్తాయి. మార్చి 18వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో సాంకేతిక విద్యాశాఖ ఉన్నతాధికారులు ఫిబ్రవరిలోనే పాలిసెట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఉపాధ్యాయులు, సాంకేతిక నిపుణులు సూచిస్తున్నారు. కోనసీమ జిల్లాలోని పాలిటెక్నిక్ కళాశాలలు, వాటిలో సీట్లు, ఆన్‌లైన్ దరఖాస్తుల గడువు, పరీక్ష తేదీ తదితర వివరాలు ఇలా ఉన్నాయి.

గ్రామీణ విద్యార్థులకు ఉపయుక్తం

గ్రామీణ పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఇంజినీరింగ్ వంటి అత్యున్నత సాంకేతిక చదువులను అందుకోవాలంటే ఎక్కువ ఖర్చుతో కూడుకున్న పని. వీరికి తక్కువ ఖర్చుతో ప్రాథమికంగా సాంకేతిక విద్య లభిస్తే దానిని పునాదిగా చేసుకుని భావి జీవితానికి బాటలు వేసుకునే అవకాశం లభిస్తుంది. దీనికి పాలిటెక్నిక్ కోర్సులు వేదికగా నిలుస్తాయి. పాలిసెట్ ద్వారా పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరి విలువైన సాంకేతిక విజ్ఞానాన్ని సొంతం చేసుకుని సత్వర ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పొందవచ్చు. పాలిసెట్–2024 కోసం దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. ఏప్రిల్ 5వ తేదీ పాలిటెక్నిక్ కోర్సులకు నిర్వహించే పాలిసెట్ దరఖాస్తులకు తుది గడువు.

కోర్సుల వివరాలు

పాలిటెక్నిక్ కోర్సులను ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలు అందిస్తున్నాయి. ఆయా కళాశాలల్లో కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్ అండ్ కంప్యూటర్స్, ఎలక్ట్రికల్, మెకానికల్, సివిల్, ఆటోమొబైల్ ఇంజినీరింగ్, ఆర్కిటెక్చర్ తదితర కోర్సులు అందుబాటులో ఉంటాయి. పలుచోట్ల ఒక్కో కోర్సులో ఒక్కో బ్రాంచ్‌కు 60 నుంచి 120 వరకు సీట్లు ఉంటాయి. కోనసీమ జిల్లా రామచంద్రపురంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఉండగా, జిల్లా వ్యాప్తంగా మరో ఐదు ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలున్నాయి. రామచంద్రపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్ 30, మెకానికల్ 30 సీట్లు ఉన్నాయి. ఐదు ప్రైవేట్ కళాశాలల్లో సుమారు 1,500 వరకు సీట్లు ఉన్నాయి. ఈ కోర్సు కాల వ్యవధి మూడు సంవత్సరాలు. దీనిలో భాగంగా ఆరు నెలల పాటు పారిశ్రామిక శిక్షణ ఉంటుంది. విద్యార్థులు నైపుణ్యం పెంపొందించుకునే శిక్షణ సైతం ఇస్తారు. పాలిసెట్ ఎంట్రన్స్‌లో క్వాలిఫై మార్కులు 35గా నిర్ణయించారు.

పాలిసెట్ పరీక్ష ఇలా..

పాలిసెట్ పరీక్షను 120 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. వీటిలో గణితం 50, ఫిజిక్స్ 40, కెమిస్ట్రీ 30 మార్కులకు ఉంటుంది. పదో తరగతి సిలబస్ ఆధారంగా ఎంట్రన్స్ పరీక్ష ఉంటుంది. ఈ ఏడాది మే 10న పాలిటెక్నిక్ ఎంట్రన్స్ పరీక్ష జరుగుతుంది. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.100, ఓసీ, బీసీ విద్యార్థులు రూ.400 పరీక్ష ఫీజుగా కట్టాలి.

ఎన్నో ప్రయోజనాలు

పాలిటెక్నిక్‌లో ఏ కోర్సును పూర్తి చేసినా ఉద్యోగం, ఉపాధి సులభంగా దొరుకుతుంది. ఈ కళాశాలల్లో ఇటీవల తరచుగా ఉద్యోగ మేళాలను నిర్వహిస్తున్నారు. ఆయా కంపెనీల ప్రతినిధులు వచ్చి విద్యార్థులను ఎంపిక చేసుకుంటున్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కోర్సు చేయడానికి మూడేళ్లకు కేవలం రూ.13 వేలు ఖర్చు అవుతుంది. ఆ తర్వాత ఇంజినీరింగ్ సెకండియర్‌లో చేరవచ్చు. లేదా ఉద్యోగానికి ప్రయత్నించవచ్చు.

ముఖ్యమైన తేదీలు

దరఖాస్తులకు గడువు	ఏప్రిల్ 5
ప్రవేశ పరీక్ష	ఏప్రిల్ 27
ఫలితాలు	మే 25
కౌన్సెలింగ్	జూన్ నాలుగో వారం నుంచి

ఉద్యోగావకాశాలు



పదో తరగతి తర్వాత పాలిటెక్నిక్ చేస్తే చిన్న వయసులోనే ఉద్యోగావకాశాలు లభిస్తాయి. ఉన్నత విద్యతో పాటు స్వయం ఉపాధికి తోడ్పడుతుంది. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ప్రతి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల్లో విద్యార్థులకు ఉచితంగా కోచింగ్‌తో పాటు, సంబంధిత మెటీరియల్‌ను సరఫరా చేస్తున్నాం.

– డాక్టర్ సముద్రాల రామారావు, ప్రిన్సిపాల్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ద్రాక్షారామ

29 నుంచి పొగాకు కొనుగోళ్లు ప్రారంభం


ఆదిశేషయ్య, పొగాకు బోర్డు రీజినల్ మేనేజర్

దేవరపల్లి: రాష్ట్రంలోని దక్షిణ (ఎస్‌బీఎస్) ప్రాంత భూములైన ఉత్తర తేలిక నేలల్లో (ఎస్‌ఎల్‌ఎస్) పండించిన పొగాకును ఈ నెల 29 నుంచి కొనుగోలు చేస్తామని పొగాకు బోర్డు రీజినల్ మేనేజర్ ఎం.ఆదిశేషయ్య బుధవారం ప్రకటనలో తెలిపారు. గుంటూరులో పొగాకు కొనుగోలు దారులు, ఉత్పత్తి దారులు, ఎగుమతిదారులతో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నామన్నారు. పొగాకు బోర్డు చైర్మన్ సీహెచ్ యశ్వంత్ కుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్ బాబు వేలం కేంద్రాలకు ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఈ నెల 29న ఒంగోలు –1, కొండేపి వేలం కేంద్రాల్లోనూ, మార్చి 6వ తేదీన కందుకూరులోని 1, 2, అలాగే వెల్లంపల్లి వేలం కేంద్రాలలో పొగాకు కొనుగోళ్ల ప్రారంభమవుతాయన్నారు. మార్చి 14న ఒంగోలు 2వ వేలం కేంద్రం, టంగుటూరు, కలిగిరి, డిచ్‌పల్లి కనిగిరి, పొదిలి, దేవరపల్లి, గోపాలపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం 1, 2 వేలం కేంద్రాలలో ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. రైతులు పండించిన పొగాకును గ్రేడింగ్ చేసి ఎటువంటి అన్యపదార్థాలు లేకుండా బేళ్లు తయారు చేయాలని సూచించారు.

లక్ష్మీనృసింహునికి అన్నపర్వత మహానివేదన

- గజ, పొన్న వాహనాలపై గ్రామోత్సవాలు
- స్వామివారికి విశేష పూజలు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆరో రోజు బుధవారం ద్వాదశి నాడు స్వామివారికి అన్నపర్వత మహానివేదనను ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలమూరు వారి సత్రం నిర్వాహకులు ఇచ్చిన బియ్యంతో అన్నం వండి, రాత్రి 7 గంటలకు స్వామివారి మూలవిరాట్ ఎదురుగా ఉన్న మండపంలో అర్చకులు అన్నాన్ని పర్వతంలా పోశారు. పప్పు, పులుసు, రెండు రకాల కూరలు, పెరుగు, నెయ్యి, బూరెలతో స్వామివారికి ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యంలో స్థానాచార్య వింజమూరి రామ రంగాచార్యులు, వేదపండితుడు చింతా వెంకటశాస్త్రి, అర్చక స్వాములు మహానివేదన సమర్పించారు. ఈ సందర్భంగా స్వామికి విశేష పూజలు చేశారు. అన్న పర్వతంలోని కొంత భాగాన్ని భక్తులందరికీ ప్రసాదంగా పంచారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమార రామ గోపాల రాజా బహద్దూర్ పాల్గొన్నారు.


అంతర్వేదిలో గజవాహనంపై గ్రామోత్సవం

గజ, పొన్న వాహనాలపై గ్రామోత్సవం

సాయంత్రం 4 గంటలకు గజ వాహనంపైన, రాత్రి 8 గంటలకు పొన్న వాహనంపైన స్వామివారి గ్రామోత్సవాలు ఘనంగా జరిగాయి. తొలుత ఆలయం నుంచి పల్లకిలో స్వామి, అమ్మవార్లను అలంకార మండపానికి తోడ్కొని వచ్చారు. మండపంలో స్వామిని పూలతో అలంకరించి విశేష పూజలు చేశారు. వాహనాల వద్ద ప్రముఖులు, అర్చకులు కొబ్బరి కాయలు కొట్టిన తదనంతరం గ్రామోత్సవానికి స్వామి బయలుదేరి వెళ్లారు.

కాగా.. స్వామివారి సన్నిధిని శుద్ధిచేసి అన్నపర్వత నివేదన కోసం సాయంత్రం 5.30 నుంచి రాత్రి 7 గంటల వరకూ భక్తులకు దర్శనాన్ని నిలిపివేశారు. అన్నపర్వత మహానివేదన అనంతరం యథావిధిగా భక్తులకు స్వామివారి దర్శనాన్ని దేవస్థానం కల్పించింది.


లక్ష్మీనృసింహునికి నివేదించిన అన్నపర్వతం

అంతర్వేదిలో నేడు..

స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం ఏడో రోజు వేకువజామున 4 నుంచి 5.30 గంటల వరకూ సుప్రభాతసేవ, స్వామివారి తిరువారాధన, స్వామివారి అలంకరణ, బాలభోగం, తదనంతరం సాధారణ, ప్రత్యేక దర్శనాలు, సాయంత్రం 4 గంటలకు హనుమద్వాహనంపైనా, రాత్రి 7 గంటలకు సింహవాహనం పైన స్వామివారి గ్రామోత్సవాలు నిర్వహించనున్నారు. సాయంత్రం 5 గంటలకు సదస్యం, 6.30 గంటలకు ధూపసేవ చేయనున్నారు.

250 కేజీల గంజాయి స్వాధీనం

- ఒకరి అరెస్టు, మరో ముగ్గురు పరారీ
- ముమ్మరంగా పోలీసుల గాలింపు


గంజాయి బస్తాలు, నిందితుడితో ఎస్సై రామకృష్ణ తదితరులు

గండేపల్లి: మండలంలోని మురారి గ్రామం వద్ద 12 బస్తాల గంజాయి (250 కేజీలు)ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీన్ని తరలిస్తున్న ఒకరి అరెస్టు చేయగా, మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. గండేపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశాలోని మల్కాన్‌గిరి జిల్లా చిత్రకొండ గ్రామానికి చెందిన దాము ఖార తన ముగ్గురు స్నేహితుల సహాయంతో దారకొండ నుంచి మహారాష్ట్రకు ఈ గంజాయిని తరలిస్తున్నాడు. అల్లూరి సీతారామరాజు జిల్లా దారకొండ నుంచి ఒక ప్రత్యేక వాహనంలో తీసుకువచ్చిన గంజాయి బస్తాలను మురారి వద్ద పోలవరం కాలువ సమీపంలో దాచి ఉంచారు. ఆదివారం అర్ధరాత్రి సమయంలో బస్తాలను తరలించేందుకు వాహనం కోసం ఎదురుచూస్తుండగా పొలాలకు కాపాలా కోసం వెళుతున్న రైతులు వీరిని గమనించి పట్టుకునేందుకు ప్రయత్నించారు. దీంతో గంజాయి బస్తాలు తీసుకు వెళ్లేందుకు వచ్చిన వాహనంతో పాటు నలుగురిలో ముగ్గురు వ్యక్తులు తప్పించుకోగా ఒకరిని పట్టుకుని పోలీసులకు సమాచారం అందజేశారు. పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి, జగ్గంపేట సీఐ ఎస్.లక్ష్మణరావు సంఘటనా స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. గంజాయి బస్తాలను, మోటారు సైకిళ్లను స్టేషన్‌కు తరలించి, నిందితులను పెద్దాపురం కోర్టుకు తరలించినట్టు ఎస్సై ఎన్.రామకృష్ణ తెలిపారు. పరారీలో ఉన్న ముగ్గురి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. గంజాయి విలువ రూ.5,12,400 (మార్కెట్‌లో రూ.30 లక్షలు) ఉంటుందని పోలీసులు తెలిపారు.

28న మెగా జాబ్ మేళా

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం జోన్ –2 పరిధిలోని ఐదు జిల్లాలకు చెందిన నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ఈనెల 28వ తేదీన రాజమహేంద్రవరంలోని వీఎల్‌పురం మార్గాని ఎస్టేట్ గ్రౌండ్‌లో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు డీఆర్‌డీఏ వైఎస్సార్ క్రాంతి పథం ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్‌వీఎస్ మూర్తి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని నాక్ కార్యాలయంలో బుధవారం తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల నోడల్ అధికారులతో సమావేశమై, జాబ్ మేళాపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ సుమారు వంద కంపెనీల ప్రతినిధులు హాజరై దాదాపు ఆరువేల ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేస్తారన్నారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి పేర్లను రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు నిర్దిష్ట ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ జాబ్‌మేళాపై నిరుద్యోగ యువతకు అవగాహన కలిగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా పరిషత్ సహాయ సీఈవో జీఎస్ రామ్ గోపాల్, జిల్లా ఉపాధి కల్పనా అధికారి కె.హరిశ్చంద్ర ప్రసాద్, జిల్లా పరిశ్రమల అధికారి బి.వెంకటేశ్వరరావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.కొండలరావు, డివిజనల్ పీఆర్‌వో ఎంఎల్ ఆచార్యులు పాల్గొన్నారు.

రైలు ప్రమాదంలో బీహార్ వాసి మృతి

తుని: రైలు ప్రమాదంలో బీహార్ రాష్ట్రానికి చెందిన వ్యక్తి మృతి చెందాడని స్థానిక జీఆర్పీ ఎస్సై షేక్ అబ్దుల్ మారూఫ్ బుధవారం తెలిపారు. వివరాలు.. బీహార్‌లోని నర్లెలీ గ్రామానికి చెందిన గణేష్ మండల్ (50) భార్య, ముగ్గురు పిల్లలతో కలిసి తమిళనాడులోని ఈ రోడ్డులో ఎనిమిదేళ్లుగా టీ వ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్నాడు. పెద్ద కుమారుడు చందన్ కుమార్ వివాహం కోసం ఎర్నాకుళం సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో కుటుంబ సమేతంగా బయలుదేరాడు. ఈ నేపథ్యంలో రావికంపాడు, అన్నవరం రైల్వేస్టేషన్ల మధ్య ప్రమాదవశాత్తూ రైలు నుంచి జారి పడ్డాడు. తీవ్ర గాయాలైన అతడిని అన్నవరం రైల్వేస్టేషన్‌కు చేర్చి, అక్కడ 108 అంబులెన్స్‌లో తీసుకువెళుతుండగా మృతి చెందాడు.

నేడు సపక్‌తక్రా క్రీడాకారుల ఎంపిక

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సపక్‌తక్రా సంఘం ఆధ్వర్యంలో జిల్లాస్థాయి జూనియర్స్, సబ్ జూనియర్స్ విభాగంలో క్రీడాకారుల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు సంఘ కార్యదర్శి ఎల్.జార్జి బుధవారం తెలిపారు. అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాల క్రీడాప్రాంగణంలో గురువారం సాయంత్రం 3 గంటలకు ఎంపికలు ప్రారంభమవుతాయన్నారు. ఎంపికైన జట్టు ఈనెల 24, 25 తేదీల్లో నెల్లూరులో జరిగే రాష్ట్రస్థాయి అంతర్‌జిల్లాల పోటీల్లో పాల్గొంటుందన్నారు. ఆసక్తి కలవారు సంబంధిత ధ్రువపత్రాలు, 4 పాస్‌పోర్టు సైజు ఫొటోలతో రావాలన్నారు. వివరాలకు కోచ్ సతీష్‌ను 85199 98997 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

25న హాకీ క్రీడాకారుల ఎంపిక

జిల్లా హాకీ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 25న సీనియర్స్ మహిళా హాకీ జట్టు ఎంపిక నిర్వహిస్తున్నట్లు సంఘ కార్యదర్శి నంబు శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. స్థానిక జిల్లా క్రీడా మైదానంలోని హాకీ కోర్టులో ఆ రోజు మధ్యాహ్నం 3 గంటలకు ఎంపికలు ప్రారంభమవుతాయన్నారు. ఎంపికైన జట్టు మార్చి 8 నుంచి 10 వరకు ప్రకాశం జిల్లా మైనంపాడులో జరిగే అంతర్ జిల్లాల హాకీ పోటీలలో పాల్గొంటుందన్నారు. వివరాలకు కోచ్ వి.రవిరాజు 94403 86168ను సంప్రదించాలని కోరారు.

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం


ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి, లక్ష్మీదేవి

పెదపూడి: మండలంలోని పుట్టకొండలో ప్రసిద్ధి చెందిన శ్రీలక్ష్మీనరసింహస్వామి, లక్ష్మీదేవిల దివ్య కల్యాణం బుధవారం తెల్లవారుజామున 4 గంటలకు ఘనంగా నిర్వహించారు. కల్యాణం సందర్భంగా ప్రధాన అర్చకులు పి.గోపాలాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు, రథోత్సవం చేశారు. అనంతరం బుధవారం తెల్లవారుజామున వేద పండితుల మంత్రోచ్చారణ, బాజాభజంత్రీలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణం అంగరంగ వైభవంగా కల్యాణం జరిపారు. లక్ష్మీనరసింహస్వామి నామస్మరణ మార్మోగింది. కల్యాణాన్ని చూసేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు వేల సంఖ్యలో హాజరయ్యారు. స్వామివారిని దర్శించుకుని కల్యాణాన్ని కనులారా వీక్షించారు. ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ పీపీ అనంతాచార్యులు, ఈఓ సీహెచ్‌వీ రమణమూర్తి ఏర్పాట్లు పర్యవేక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ వల్లు వెంకటరమణ, ఉప సర్పంచ్ మిరియాల శ్రీను, తాడాల మణికంఠ, గ్రామ కన్వీనర్ మేడిశెట్టి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు క్యూరింగ్ విధానం పరిశీలన

గోపాలపురం: అంతర్జాతీయ మార్కెట్‌కు అనుకూలంగా రైతులు పొగాకును ఉత్పత్తి చేయాలని రాజమహేంద్రవరం పొగాకు బోర్డు రీజినల్ మేనేజర్ ఎం.ఆదిశేషయ్య అన్నారు. వేళ్లచింతలగూడెంలో పొగాకు క్యూరింగ్ విధానాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పొగాకు తల తుంచడం, పిలకల నివారణ, ఆకు తుంచడం వంటి అంశాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో వేలం నిర్వాహణాధికారి, అమలీడీ శ్యామ్, ఎస్‌జీఓ పి.హేమశ్రిత, వివిధ కంపెనీల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

పోస్టల్ పథకాలపై అవగాహన అవసరం



మెగా మేళాలో మాట్లాడుతున్న పోస్టల్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శివనాగరాజు

అమలాపురం టౌన్: పోస్టల్ శాఖ అమలు చేస్తున్న వివిధ పథకాలపై ప్రజలు అవగాహన పెంచుకుని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ విజయవాడ రాష్ట్ర సర్కిల్ కార్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్ జి.శివనాగరాజు సూచించారు. పోస్టల్ పథకాలపై డాక్ కమ్యూనిటీ డవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో భాగంగా స్థానిక లయన్స్ మీటింగ్ హాలులో బుధవారం మెగా మేళా జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన శివనాగరాజు మాట్లాడుతూ పోస్టాఫీసు సేవింగ్స్ బ్యాంక్, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కాకినాడ ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ (ఐపీపీబీ) సీనియర్ మేనేజర్ కె.రాజకుమార్, అమలాపురం సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ వీఎస్‌ఎంవీ వంశీ, కొత్తపేట సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ కె.అమర్నాథ్ మాట్లాడుతూ పథకాల వారీగా పోస్టల్ వినియోగదారులకు వివరించి వాటి వల్ల చేకూరే ప్రయోజనాలను విశ్లేషించారు. అమలాపురం పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ చెరుకూరి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ మెగా మేళాలో సబ్ పోస్ట్‌మాస్టర్లు, బ్రాంచి పోస్ట్ మాస్టర్లు పాల్గొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఎక్కువ పోస్ట్ ఆఫీస్ సేవింగ్స్ బ్యాంక్ ఖాతాలు తెరిచిన వారికి, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ అధిక ప్రీమియం సేకరించిన వారిని, అధికంగా ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ ఖాతాలు చేసిన వారికి అసిస్టెంట్ డైరెక్టర్ శివనాగరాజు చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. మెగా మేళాలో బుధవారం ఒక్కరోజే రూ.34.50 లక్షల ఇన్సూరెన్స్ ప్రీమియం సేకరించినట్లు సూపరింటెండెంట్ శ్రీనివాస్ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్



■ బంగారము బ్యాంకులలో, ప్రైవేట్ ఫైనాన్స్‌లలో తనఖాలలో ఉన్నవి మాత్రమే విడిపించి కొనబడును. వేలంలో ఉన్న బంగారం విడిపించి తక్కువ గడువు తోటి తనఖా ఇవ్వబడును. ✆ : 73966 71666 [R-6442]


BUSINESS OFFER



■ కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రాజెక్ట్‌ను అందిస్తుంది.వ్యక్తిగత,విద్య,టెక్‌పవర్ అగ్రికల్చర్ ఏజెంట్‌కావలెను.DMA Welcome, Salary + కమీషన్ ఆఫీసు, ఖర్చులు, ✆ 9773917835. [T-1252668]

■ ద్వారక ఎంటర్‌ప్రైజెస్: పేపర్‌ప్లేట్స్ & LED మిషన్స్‌పై ప్రతినెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం. ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం ✆ 9310515624, 8800496710 [G-1438]

GOLD FINANCE



■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299 [B-2388]



■ రాజమండ్రి, కాకినాడ, తుని ప్రాం కం॥ ATM's, స్టార్ హోటల్స్, షోరూమ్స్ నందు సెక్యూరిటీ గార్డ్స్, సై॥ సూపర్ వైజర్స్ కావలెను. జీ॥ 12 to 15 వేలు రూ౦భో. రాజ్ సెక్యూరిటీ దేవిచౌక్, రాజమండ్రి. ✆ : 93922 69369 [R-350]

■ SKS గ్రూప్ ద్వారా 5 స్టార్ హోటల్స్ నందు పని చేయుటకు హౌస్ కీపింగ్ బాయ్స్,లేడీస్, సెక్యూరిటీ గార్డ్స్ 8 మరియు 12 గంటల డ్యూటీ రాజమండ్రి. సంప్ర: 9052500918 [P-192865]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520, 9059633520. [M-1167528]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18k ఫోన్. 9160900024 / 9640400073 [HA-1254]

■ బాలాజీ గ్రూపు, (AP, న్యూ ఢిల్లీ No.1) శ్రీమంతుల ఇళ్ళలో వృద్ధులకు/పేషంట్ల సేవకు, ఇంటి / వంట పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్స్ కావలెను. భో+వ:జీ: 16-18 వేలు, ఏజెంట్లకు 5వేలు కమీషన్ ✆ 6301053500, 9281452845 [B-1239083]

■ బాలాజీ గ్రూప్ (AP, TS & న్యూఢిల్లీ నెం-1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవ, ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో+వ+జీతం 16-18 వేలు, ఏజెంట్లకు 5000/- కమీషన్. Ph: 9963571122, 9553461177 [H-787797]

■ APSRTC నందు Outsourcing Jobs కోసం కాకినాడ, రాజమండ్రి, నరసాపురం, నిడదవోలు డిపోలలో పనిచేయుటకు బాయ్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం PF & ESI కలదు. ✆ : 94937 85599, 79933 21799, 88440 74382 [R-2089]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
సాక్షి క్లాసిఫైడ్స్
నాలుగు లైన్లకు రూ. : 400/-
అదనపు లైనుకు రూ. : 90/-
GST 5% Extra
సర్వే నెం.264, ADB రోడ్, రాజానగరం.
ఫోన్స్: 0883-2483010

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

కెనరా బ్యాంక్ Canara Bank — ఎఆర్ఎమ్ బ్రాంచ్ (13591) #30-15-141, 2వ అంతస్తు, దాబాగార్డెన్స్, విశాఖపట్నం-20. ☎ 0891-2724155

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు డిమాండ్ నోటీసు

కు:
ఋణగ్రహీత: (1). M/s. వినాయక ఎంటర్‌ప్రైజెస్, ప్రొప్రయిటర్: చిట్టూరి కోటేశ్వర రావు, వినాయక గుడి దగ్గర, మెయిన్ రోడ్డు, తాళ్లరేవు, తూర్పుగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్-533004. (2) శ్రీ చిట్టూరి కోటేశ్వరరావు, తండ్రి: స్వామి, డి.నెం. 3-83, గొల్లల వీధి, క్రాంతి స్కూల్ దగ్గర, సర్పవరం, తూర్పుగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్- 533005. హామీదారు: శ్రీ పొలమూరి సత్యానంద మూర్తి, తండ్రి: వెంకట రాజు, డి.నెం. 1-170, దొరగారి కాలనీ, జి. భీమవరం, తూర్పుగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్-533462.
డియర్ సర్/మేడమ్,
విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 లోని సెక్షన్ 13(2) ప్రకారం డిమాండ్ నోటీసు.
మా కెనరా బ్యాంక్ నుండి M/s. వినాయక ఎంటర్‌ప్రైజెస్ ప్రొప్రయిటర్: చిట్టూరి కోటేశ్వర రావు గారు పొందిన లోన్/ఋణసౌకర్యాల వివరములు:

పరిమితి	లోన్ మొత్తం	తేది: 31.12.2023 నాటికి బకాయి	వడ్డీ రేటు
FUND BASED	రూ. 25,00,000/-	రూ. 36,88,596.19	10.55%
	రూ. 1,66,535/-	రూ. 2,41,180.74	12.90%

మాకు తనఖా పెట్టిన వ్యక్తి / వ్యక్తులచే వ్రాసి ఇవ్వబడిన సంబంధిత డాక్యుమెంట్ల ద్వారా ఈ నోటీసును షెడ్యూలులో వివరించిన ఆస్తుల తనఖా ద్వారా పైన తెలిపిన ఋణాలు / ఋణసౌకర్యాలకు తగు విధంగా హామీ కల్పించబడినది. పేర్కొన్న నియమ నిబంధనల ప్రకారం తమ ఋణాలను చెల్లించడంలో పైన తెలిపిన మీరు విఫలమైనందున బ్యాంక్ సదరు ఋణాన్ని తేది 30.12.2020న నిరర్థక ఆస్తి (ఎన్.పి.ఎ) గా వర్గీకరించింది. అందువలన ఈ నోటీసు తేది నుండి 60 రోజులలోగా రూ.39,29,776.93 (అక్షరాల ముప్పై తొమ్మిది లక్షల ఇరవై తొమ్మిది వేల ఏడు వందల డెబ్బై ఆరు రూపాయలు మరియు తొంభై మూడు పైసలు) + తదుపరి వడ్డీ, ఖర్చులు కలిపి మొత్తమును చెల్లించవలసిందిగా కోరుతూ సంబంధిత చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద మీకు అందుమూలముగా ఈ నోటీసు జారీ చేయుచున్నాము. చెల్లించడంలో విఫలమైతే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అన్ని లేదా ఏవేని హక్కును మేము వినియోగించుకుంటాము. ఇంతే కాకుండా మా ముందస్తు సమ్మతి లేకుండా ఏ విధంగానూ షెడ్యూలులో తెలిపిన ఏ సెక్యూర్డ్ ఆస్తులతో ఏ రకంగానూ వ్యవహరించకుండా మీరు నిరోధించబడుచున్నారు. సదరు చట్టం మరియు/ లేదా అమలులో ఉన్న చట్టం క్రింద లభించే ఏవేని ఇతర హక్కుకు ఎటువంటి ప్రతికూల అభిప్రాయం లేకుండా ఈ నోటీసు ఇవ్వబడింది.
SARFAESI చట్టం సందర్భ సెక్షన్ 13, సబ్ సెక్షన్ (8) ప్రకారము మీరు తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరని సూచించడమైనది. మా బ్రాంచ్ రికార్డులో అందుబాటులో ఉన్న మీ చిరునామాకు తిరుగు రశీదుతో కూడిన రిజిస్టర్డ్ పోస్టు ద్వారా డిమాండ్ నోటీసు పంపించడం జరిగింది.

తనఖా / తాకట్టు వుంచిన ఆస్తి యొక్క నిర్దిష్ట వివరాలు దిగువ పేర్కొనబడినవి

తూర్పుగోదావరి జిల్లా, కాకినాడ రూరల్ మండలం, సర్పవరం ఎస్‌ఆర్‌ఓ, సర్పవరం గ్రామపంచాయతీ మరియు గ్రామం, ఎస్.నెం.63/2, ప్లాట్ నెం.19 లోని చిట్టూరి కోటేశ్వరరావు పేరునగల 136 చ॥గ॥ లేదా 114.2 చ॥మీ॥ స్థలంతో అందులోని డి.నెం.2-18/1 గల ఆర్‌సిసి బిల్డింగ్ (గ్రౌండ్ + 2 అంతస్తులు) అన్ని ఈజ్‌మెంటరీ హక్కులతో సహా యావత్తు. హద్దులు: తూర్పు: ప్లాట్ నెం.20 లోని స్థలం, పడమర: రోడ్డు, ఉత్తరం: 20 అ॥ వెడల్పు రోడ్డు, దక్షిణం: ప్లాట్ నెం.1 లోని స్థలం.

తేది: 05.02.2024, ప్రదేశం: విశాఖపట్నం — సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

కెనరా బ్యాంక్ Canara Bank — ఎఆర్ఎమ్ బ్రాంచ్ (13591) #30-15-141, 2వ అంతస్తు, దాబాగార్డెన్స్, విశాఖపట్నం-20. ☎ 0891-2724155

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు డిమాండ్ నోటీసు

కు:
ఋణగ్రహీత: శ్రీమతి వానంశెట్టి గౌరీ కామేశ్వరి, భర్త: వి. కామేశ్వరరావు, డి.నెం.1-348, మునసబుగారి వీధి, చీడిగ, కాకినాడ రూరల్, ఇంద్రపాలెం, తూర్పుగోదావరి జిల్లా, ఏపీ-533006. హామీదారు: శ్రీ మద్దు శ్రీనివాసరావు, తండ్రి: ఎమ్. సూరిరాజు, డి.నెం.11-294, డ్రైవర్స్ కాలనీ, తూరంగి, కాకినాడ రూరల్, తూర్పుగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్-533016.
డియర్ సర్/మేడమ్,
విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 లోని సెక్షన్ 13(2) ప్రకారం డిమాండ్ నోటీసు.
మా కెనరా బ్యాంక్ నుండి శ్రీమతి వానంశెట్టి గౌరీ కామేశ్వరి గారు పొందిన లోన్ వివరములు:

పరిమితి	లోన్ మొత్తం	తేది: 31.12.2023 నాటికి బకాయి మొత్తం	వడ్డీ రేటు
FUND BASED	రూ. 30,00,000/-	రూ. 74,16,637.89	10.95%
	రూ. 8,00,000/-	రూ. 18,33,688.95	12.95%
	రూ. 3,00,000/-	రూ. 5,89,858.73	12.45%

మాకు తనఖా పెట్టిన వ్యక్తి / వ్యక్తులచే వ్రాసి ఇవ్వబడిన సంబంధిత డాక్యుమెంట్ల ద్వారా ఈ నోటీసును షెడ్యూలులో వివరించిన ఆస్తుల తనఖా ద్వారా పైన తెలిపిన ఋణాలు / ఋణసౌకర్యాలకు తగు విధంగా హామీ కల్పించబడినది. పేర్కొన్న నియమ నిబంధనల ప్రకారం తమ ఋణాలను చెల్లించడంలో పైన తెలిపిన మీరు విఫలమైనందున బ్యాంక్ సదరు ఋణాన్ని తేది 30.03.2017న నిరర్థక ఆస్తి (ఎన్.పి.ఎ) గా వర్గీకరించింది. అందువలన ఈ నోటీసు తేది నుండి 60 రోజులలోగా రూ.98,40,185.57 (అక్షరాల తొంభై ఎనిమిది లక్షల నలభై వేల నూట ఎనభై ఐదు రూపాయలు మరియు యాభై ఏడు పైసలు) + తదుపరి వడ్డీ, ఖర్చులు కలిపి మొత్తమును చెల్లించవలసిందిగా కోరుతూ సంబంధిత చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద మీకు అందుమూలముగా ఈ నోటీసు జారీ చేయుచున్నాము. చెల్లించడంలో విఫలమైతే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అన్ని లేదా ఏవేని హక్కును మేము వినియోగించుకుంటాము. ఇంతే కాకుండా మా ముందస్తు సమ్మతి లేకుండా ఏ విధంగానూ షెడ్యూలులో తెలిపిన ఏ సెక్యూర్డ్ ఆస్తులతో ఏ రకంగానూ వ్యవహరించకుండా మీరు నిరోధించబడుచున్నారు. సదరు చట్టం మరియు/ లేదా అమలులో ఉన్న చట్టం క్రింద లభించే ఏవేని ఇతర హక్కుకు ఎటువంటి ప్రతికూల అభిప్రాయం లేకుండా ఈ నోటీసు ఇవ్వబడింది.
SARFAESI చట్టం సందర్భ సెక్షన్ 13, సబ్ సెక్షన్ (8) ప్రకారము మీరు తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరని సూచించడమైనది. మా బ్రాంచ్ రికార్డులో అందుబాటులో ఉన్న మీ చిరునామాకు తిరుగు రశీదుతో కూడిన రిజిస్టర్డ్ పోస్టు ద్వారా డిమాండ్ నోటీసు పంపించడం జరిగింది.

తనఖా / తాకట్టు వుంచిన ఆస్తి యొక్క నిర్దిష్ట వివరాలు దిగువ పేర్కొనబడినవి

తూర్పుగోదావరి జిల్లా, కాకినాడ రూరల్ మండలం, కాకినాడ ఎస్‌ఆర్‌ఓ, చీడిగ గ్రామం, ఎస్.నెం. 7/1, డి.నెం. 1-348 కలిగిన 225 చ॥గ॥ లేదా 188-12 చ॥మీ॥ ఇంటి స్థలం మరియు అందులోని రెసిడెన్షియల్ బిల్డింగ్ శ్రీమతి వానంశెట్టి గౌరీ కామేశ్వరి పేరునగలదు. హద్దులు: తూర్పు: గీసాల సత్యనారాయణ భూమిని ఆనుకొని ఒక గజం వెడల్పు రోడ్డు, పడమర: పితాని సూర్యారావు యొక్క స్థలం, ఉత్తరం: పితాని సూర్య కృష్ణ యొక్క స్థలం, దక్షిణం: పంచాయితీ వీధి.

తేది: 05.02.2024 ప్రదేశం: విశాఖపట్నం — సం/- అధీకృత అధికారి కెనరా బ్యాంక్